## కాల్వ నీళ్లు రాకపాయె.. మూగ జీవాలకు మేతాయె..




.. ఇక్కడ మూగ జీవాలు మేస్తూ కనిపిస్తున్న పొలం కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లోని ఓ రైతుది. ఈ గ్రామానికి ఎస్సారెస్పీ కాలువకు అనుబంధంగా ఉన్న డీ-89 ద్వారా నీరందాల్సి ఉండగా, చివరికి ఉండడంతో చుక్క నీరు అందక పొలాలు ఇలా ఎండిపోతున్నాయి. దీంతో మూగజీవాలను మేత కోసం ఇలా వదులుతున్నారు.

**- కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28**

# గెలుపుపై ఉత్కంఠ!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విషయంలో క్లియర్‌కట్!
- పట్టభద్రుల ఎమ్మెల్సీపై ఎవరి ధీమా వారిదే
- విజయం లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- రెండో ప్రాధాన్యత వరకు వస్తే తారుమారు కానున్న జాతకాలు
- కోవర్టుల పాత్రపై కాంగ్రెస్, బీజేపీలో అనుమానాలు
- నమ్మకంగా పనిచేశారా..? నమ్మించారా..? అన్నదానిపై కూపీలాగుతున్న పలు పార్టీలు




*కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గెలుపుపై ఆయా పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు జరిగిన తీరు.. పెరిగిన పోలింగ్ శాతం నాయకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోపల మాత్రం అందరిలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మిన నాయకులు తమ విజయం కోసం పని చేశారా..? లేక నమ్మించి కోవర్టుల్లా మారారా..? అన్న మీమాంసలోనూ కొంతమంది కొట్టుమిట్టాడుతున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా చూస్తే గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థుల మధ్యే పోటీ కనిపిస్తుండగా.. టీచర్ ఎమ్మెల్సీ విషయంలో మాత్రం రిజల్ట్ దాదాపు క్లియర్‌కట్‌గానే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా.. కౌటింగ్‌లో భాగంగా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు వరకు వస్తే మాత్రం చాలా మంది అంచనాలు తారుమారు అయ్యే అవకాశాలున్నాయి. అయినా అభ్యర్థులు మాత్రం ఎవరికి వారే శ్రేణులతో లెక్కల్లో మునిగి తేలుతుండగా, ఎల్లుండి సాయంత్రం వరకు ఉత్కంఠ వీడనున్నది.*

కరీంనగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఇక కౌంటింగే మిగిలింది. సోమవారం ఫలితాలు వెల్లడి కానుండగా, గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్‌శాతం పెరిగింది. అయితే పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి విజయం చేకూర్చుతుందన్న చర్చ ప్రస్తుతం అన్ని వర్గాల్లో నడుస్తున్నది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఫలితాలపై కొంత క్లియర్ కట్‌గానే సమాచారం వస్తుండగా.. పట్టభద్రుల విషయంలో మాత్రం అన్ని వర్గాల్లోనూ ఉత్కంఠ కనిపిస్తున్నది. గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి మొత్తం 3,55,159 మంది ఓటర్లు ఉండగా... అందులో 2,50,106 మంది (70.42శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా 1,05,053 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. నిజానికి ఈసారి ఓటర్ల నమోదు విషయంపై బరిలో నిచిలిన అభ్యర్థుల్లో చాలా మంది దృష్టిపెట్టారు. ఫలితంగా భారీగా ఎన్‌రోల్‌మెంట్ జరిగింది. అయితే ప్రస్తుతం జరిగిన పోలింగ్ ప్రకారం చూస్తే యాభైశాతం దాటి అంటే 1,25,053పైగా ఓట్లు వస్తే ముందుగానే సదరు అభ్యర్థిని గెలిచినట్టు ప్రకటిస్తారు. కానీ, పట్టభద్రుల విషయంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే మాత్రం బరిలో ఉన్న ఏ అభ్యర్థికి కూడా ముందుగానే ఇన్ని ఓట్లు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓటుకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 56 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రెండో ప్రాధాన్యతకు వెళ్లాల్సి వస్తే ముందుగా అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి వద్ద నుంచి ఎలిమినేట్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కించాల్సి వస్తే చాలా మంది అంచనాలు తారుమారయ్యే అవకాశమున్నది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ కనిపిస్తున్నది. అందులో బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ, బీజేపీ నుంచి అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి మధ్యే గెలుపోటములు ఉంటాయన్న అంచనాలు వస్తున్నాయి. అయితే ఈ ముగ్గురిలోనూ ఏ ఒక్కరికీ మొదటి దఫాలోనే యాభైశాతానికి మించి వచ్చే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో రెండో ప్రాధాన్యతకు వెళ్తే అక్కడ ఎవరి తలరాతలు తారుమారు అవుతాయో అన్న చర్చ ప్రస్తుతం ఆయా వర్గాల్లో నడుస్తున్నది. ఈనేపథ్యంలోనే రెండో ప్రాధాన్యత ఓటు తనకంటే.. తనకు వచ్చిందంటూ అభ్యర్థులు అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఫలితాలు కొంత క్లియర్‌కట్‌గానే కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ సరళిని చూస్తే పీఆర్టీయూ నుంచి పోటీ చేసిన మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి పోటీ చేసిన కొమురయ్య మధ్యే గెలుపోటములుంటాయన్న అభిప్రాయాలున్నాయి. అందులోనూ ఈసారి పార్టీ అభ్యర్థే గెలిచేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. చాలా మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా.. పీఆర్టీయూ యూనియన్‌కు ఉన్న సభ్యత్వం, ఆ యూనియన్ శ్రేణులు మనసు పెట్టి పనిచేసి ఉంటే... లేదా ఆ సంఘంలోని ప్రతి ఒక్కరూ పీఆర్టీయూ మహేందర్‌రెడ్డికి ఓటు వేసి ఉంటే గెలుపోటములు తారుమారు కూడా కావచ్చన్న చర్చ కూడా నడుస్తున్నది.

### ఓటువేశారా.. నటించారా..?

ఇన్నాళ్లూ తమ వెంటే ఉంటూ ప్రచారం చేసిన చాలా మంది తమకు ఓటువేశారా..? నటిస్తూ కోవర్టులుగా పనిచేశారా? అన్నదానిపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ప్రస్తుతం భారీ చర్చ నడుస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిజానికి ఈ అనుమానం కొంత మంది అభ్యర్థుల్లోనూ ఉండగా.. ప్రధాన పార్టీల్లో మాత్రం ఈ విషయంపై రకరకాల చర్చ జరుగుతున్నది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన వెంటే ఉన్నామంటూ చెప్పుకొచ్చిన వారు సహకరించారా..? లేక అందులోని కొంతమంది ఇతర పార్టీలకు కోవర్టులుగా మారారా..? అన్న చర్చే ప్రస్తుతం ఆపార్టీలో హాట్‌టాపిక్‌లా మారింది. అంతేకాదు, ఆపార్టీలోని చాలా మంది కూడా అభ్యర్థికి సంపూర్ణంగా సహకరించలేదన్న వాదనలు కూడా ప్రస్తుతం తెరపైకి వస్తున్నాయి. స్వయాన ఓ మంత్రి అభ్యర్థి గెలుపు కోసం మీటింగ్ పెడితే.. అక్కడ పాల్గొన్న వారిలో మెజార్టీ మంది వాట్సాప్ స్టేటస్‌లో మరో అభ్యర్థికి ఓటువేయాలని పెట్టిన తీరు ప్రస్తుతం ఆపార్టీలో చిచ్చు రేపుతున్నది. అలాగే నిత్యం వెంట తిరిగిన చాలా సంఘాలు, నాయకులు సైతం హస్తం అభ్యర్థికి ఓటు వేశారా.. లేదా? అన్నదానిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ఓటు వేయకపోగా, కొంతమంది కోవర్టులుగా మారారాన్న అభియోగాలు ఆ పార్టీలోనే వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయంపై చాలా మంది పెద్ద నాయకులకు స్పష్టత ఉన్నా.. ఫలితాల వరకు వేచిచూడాలన్న ధృక్పథంతో ముందుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే పరిస్థితి బీజేపీలోనూ కనిపిస్తున్నది. ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చాలా మంది సహకారం అందించలేదన్న చర్చ ప్రస్తుతం ఆ పార్టీలోనూ నడుస్తున్నది. అయితే అభ్యర్థికి సంబంధించి ప్రచార కార్యక్రమాల సమాచారం తమకు అందలేదని, తమకు సమాచారం లేనప్పుడు తాము ఎలా ముందుకెళ్తామని కొంత మంది సీనియర్లు ఇప్పటికే తేల్చిచెప్పినట్టు తెలుస్తున్నది. అలాగే ఈ పార్టీలోనూ కొంత మంది అటుఇటుగా వ్యవహరించారనే చర్చ ప్రస్తుతం నడుస్తున్నది. మొత్తంగా చూస్తే కౌటింగ్ తర్వాత కాంగ్రెస్, బీజేపీలో భారీగానే ఒడిదొడుకులుంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పార్టీల్లో జరుగుతున్న చర్చ చూస్తే.. తమ వెంటే ఉంటున్నట్టు నటించారా..? లేక తెలివిగా ఇతర పార్టీలకు సహకరించారా..? అన్నదే ప్రస్తుతం ఆయా పార్టీలు, అభ్యర్థుల్లో ప్రధాన చర్చగా నిలుస్తున్నది.

## అక్రమ కేసులు పెడితే ఊరుకోం.. జైల్ భరో చేపడుతాం

- రైతులపై వేధింపులు మానుకోవాలి
- బీఆర్ఎస్ నాయకులు
- రైతు రాజిరెడ్డికి పరామర్శ



*జిల్లెల్లలో రైతు రాజిరెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు*

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 28: బీఆర్ఎస్ నేతలు, రైతులపై అక్రమ కేసులు పెడితే ఊరుకోమని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. జైలుకు పంపాలని కక్షపూరితంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, 'జైలు భరో' చేపడుతామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపాలని, వేధింపులకు గురిచేయొద్దని సూచించారు. రైతులపై మీకు చిత్తశుద్ధి ఉంటే రైతు సంక్షేమానికి కృషి చేయాలని, అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని భరోసానిచ్చారు. అక్రమ కేసులో జైలుకు వెళ్లిన తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డి బుధవారం మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో బెయిల్ మంజూరై, ఇంటికి వచ్చాడు. కాగా, శుక్రవారం రాజిరెడ్డిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, సీనియర్ నేత బొల్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజిరెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిరిసిల్లలో ప్రభుత్వ భూములు ఆక్రమించారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు, సామాన్య రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపడం దారుణమన్నారు. కలెక్టర్ రెస్యూమ్ చేసుకున్న 350 ఎకరాలు ఎవరివని ప్రశ్నించారు? వాటి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలతోపాటు ఇంటిపేరు ఒకేలా ఉన్న సామాన్య రైతుపై కేసు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. రైతులను అరెస్ట్ చేస్తామని, జైలుకు పంపుతామని బెదిరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజిరెడ్డికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని, ఆయన 30 గుంటల భూమి తిరిగి వచ్చేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్లు బండి దేవదాస్ గౌడ్, కోడూరు భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ మానస, మాజీ అధ్యక్షుడు అంకారపు రవీందర్, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరమణా రెడ్డి, నాయకులు మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, పడిగెల రాజు, పబ్బతి విజేందర్ రెడ్డి, బండి జగన్, తాండ్ర రవీందర్ రావు, సతీశ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రామాగౌడ్, రమేశ్, కృష్ణ, పూర్ణ, జవహర్ రెడ్డి, మిరాల భాస్కర్‌యాదవ్, అఫ్రోజ్, ఎల్లం యాదవ్, జగత్, చిరంజీవి, ప్రేమ్‌కుమార్, అమర్‌రావు, రమేశ్, శ్రీకాంత్ తదితరులున్నారు.





*ముత్తారం మండలం ఓడేడ్ మానేరు నదిపై అక్రమంగా మట్టి రోడ్డు నిర్మించి గేట్ వేసి వసూళ్లు చేస్తున్న వ్యక్తులు*

*గేట్ వేసి బైక్‌లు, ఆటోలను ఆపి వసూళ్లు చేస్తూ..*

# గేటెయ్.. దోచెయ్!

పెద్దపల్లి-జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దు మానేరు తీరం ఓడేడ్-గర్మిళ్లపల్లి వద్ద టోల్‌గేట్ పేరిట వసూళ్ల దందా సాగుతున్నది. నదిలో కిలోమీటర్ మేర తాత్కాలిక మట్టిరోడ్డు వేసి, ఆపై అనధికార టోల్‌గేట్ పెట్టి దండుకుంటున్నట్టు వెలుగుచూస్తున్నది. ఒక్కో వాహనానికి ఒక్కో రేటు నిర్ణయించడం, పైగా ద్విచక్రవాహనాలకు సైతం వసూలు చేయడంపై వాహనదారుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇదంతా కండ్ల ముందే కనిపిస్తున్నా పట్టించుకునేవారే లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

- మట్టి రోడ్డు వేసి టోల్ పేరిట దందా
- ఒక్కో వాహనానికి ఒక్కో రేటు నిర్ణయం
- ఆలయ అభివృద్ధి కమిటీ పేరిట వసూళ్లు
- ద్విచక్రవాహనాలకు సైతం గుంజుడే
- నిత్యం రూ.లక్షపైనే కలెక్షన్
- వాహనదారుల జేబులు గుల్ల
- అధికారుల చోద్యంపై విమర్శలు

## ఓడేడ్ -గర్మిళ్లపల్లి మానేరు నదిపై అనధికార టోల్‌గేట్

పెద్దపల్లి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గర్మిళ్లపల్లి వద్ద మానేరుపై వేసిన తాత్కాలిక రోడ్డు మీదుగా పెద్దపల్లి, భూపాలపల్లితోపాటు కరీంనగర్ జిల్లాలోని సుమారు 80 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, ఇదే అదునుగా ఓడేడ్‌కు చెందిన కొంత మంది దోపిడీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అనధికారికంగా (ఓడేడ్- గర్మిళ్లపల్లి) మానేరు నదిలో తాత్కాలిక మట్టి రోడ్డు వేసి, టోల్ గేట్‌ను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వసూళ్లకు దిగుతున్నారు. ఒక్కో వాహనానికి ఒక్కో రేటును నిర్ణయించి ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారు. సాధారణంగా 70 నుంచి 100 కిలో మీటర్ల రహదారులకు ₹35 నుంచి ₹75 వరకు వసూలు చేస్తారు. ద్విచక్రవాహనాలకు ఎక్కడా టోల్ గేట్ వద్ద వసూళ్లు ఉండవు కానీ, ఇక్కడ వాటికి సైతం డబ్బులు తీసుకుంటున్నారు. ఒక్క రోజు అటు దాటాలన్నా.. ఇటు దాటాలన్నా ఇక్కడ టోల్ కట్టాల్సిందే. లేని పక్షంలో ఆ మానేరు దాటడం కుదరదు.

### ఆలయ అభివృద్ధి కమిటీ పేరిట..

టోల్‌గేట్ నిర్వహిస్తున్న నిర్వాహకులు ఓడేడ్ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ పేరిట రసీదులు ఇస్తున్నారు. ఇక్కడ రోజువారీగా వసూలు చేసే డబ్బులను ఆ ఆలయ అభివృద్ధి కోసం వినియోగిస్తామనే విధంగా వసూళ్లకు దిగుతున్నారు. అయితే, గతేడాది గర్మిళ్లపల్లి గ్రామస్తులు ఇదే తీరుగా వసూళ్లు చేయగా.. ఈ ఏడాది ఓడేడు చెందిన కొంత మంది వసూళ్లు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.



*రసీదు పుస్తకాలు*

### వేలం వేసిందెవరు?

టోల్‌గేట్ నిర్వహించేందుకు పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకుగాను గ్రామంలో అనధికారికంగా టెండర్లు పిలిచినట్టు తెలుస్తున్నది. ఒక ప్రైవేట్ డాక్టర్ ₹18లక్షలకు ఈ టెండర్‌ను దక్కించుకున్నాడనే ప్రచారం జరుగుతున్నది. టోల్‌గేట్ డబ్బులు వసూలు చేసే కలెక్షన్ బాయ్స్ కూడా ఇదే చెబుతున్నారు. అయితే ఈ అనధికారిక వేలం ఎవరు వేశారు? ఆ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తాయి? టెండర్ వేసేందుకు వారికున్న అర్హతలేమిటి? అనే విషయంపై ప్రభుత్వ అధికారులకు ఇప్పటికే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయినా పట్టించుకునే వారే లేరనే విమర్శలున్నాయి.

### ఒక్కో వాహనానికి ఒక్కో రేటు!

అనధికార టోల్ గేట్ వద్ద ఒక్కో వాహనానికి ఒక్కో ధరను నిర్ణయించారు. అందులో లోడ్ లారీకి ₹500, ఖాళీ లారీకి ₹300, వ్యాన్‌కు ₹150, కారుకు ₹100, ఆటోకు ₹50, బైక్‌కు ₹30 వసూలు చేస్తున్నారని వాహనదారులు చెబుతున్నారు. రాష్ట్ర, జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ల వద్ద కూడా ఇంతగా వసూలు చేయడం లేదంటున్నారు. కానీ, ఇక్కడ మాత్రం అనధికారికంగా ఏర్పాటు చేయడమే కాదు, అడ్డంగా దండుకుంటున్నారని మండిపడుతున్నారు.

### రోజుకు ₹లక్ష వరకు వసూళ్లు?

రెండు జిల్లాల సరిహద్దు మానేరు నదిపై వేసిన తాత్కాలిక మట్టి రోడ్డు కాసులు కురిపిస్తున్నది. ఇక్కడ నిత్యం వందలాది వాహనాలు మానేరు దాటుతుండడంతో అనధికార టోల్ నిర్వాహకులు పెద్ద ఎత్తున దండుకుంటున్నారు. ప్రతి రోజూ పగలు ఇద్దరు, రాత్రి ఇద్దరు కలెక్షన్ బాయ్స్‌ను పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. నిత్యం కలెక్షన్ ₹80వేల నుంచి ₹లక్ష వరకూ ఉంటున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల శివరాత్రి సందర్భంగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాలలో కొలువైన గట్టుమల్లన్న జాతరకు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నుంచి వందలాది మంది వెళ్లగా, ఆ రోజు వసూళ్లు సైతం పెద్ద ఎత్తునే సాగాయి. రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హైమాస్ట్ లైట్‌ను సైతం ఏర్పాటు చేశారు. దీనికితోడు గేటు వద్ద ఉన్న గుడిసెకు ఒక సీసీ కెమెరాను సైతం అమర్చి, ఎవరూ నిలదీయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, ఆ సీసీ కెమెరా ముత్తారం పోలీసులు ఏర్పాటు చేశారని, రాకపోకలపై నిఘా కోసం ఏర్పాటు చేసినట్లుగా కలెక్షన్ బాయ్స్ చెబుతున్నారు.

### అదనపు భారం

భూపాలపల్లి జిల్లా పరిధిలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, పర్కాల, కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలాల ప్రజలు మంథనికి రావాలన్నా, గోదావరిఖనికి రావాలన్నా.. కాల్వశ్రీరాంపూర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఓడేడ్ తాత్కాలిక రోడ్డు నుంచి కాకుండా ఇలా వస్తే అదనంగా 30 నుంచి 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, గోదావరిఖని, మంచిర్యాల, శ్రీరాంపూర్, జైపూర్, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాల ప్రజలు అటు వెళ్లాలన్నా అంతే దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది. ఓడేడ్-గర్మిల్లపల్లి మానేరు నదిలో వేసిన మట్టి రోడ్డుతో దూరం తగ్గుతున్నా, టోల్ వసూలుతో అదనపు భారం మీదపడుతున్నది. కేసీఆర్ హయాంలో వాహనదారుల వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకొని మాజీ ఎమ్మెల్యేలు మధుసూధనచారి, పుట్ట మధూకర్ ఇదే మానేరుపై మట్టి రోడ్డు వేసి, ఉచిత ప్రయాణాలకు వీలు కల్పించారు. కానీ, ప్రస్తుతం పెద్ద ఎత్తున వసూళ్లకు దిగుతుండడంతో ప్రజలు, సింగరేణి ఉద్యోగులు, రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజూ భూపాలపల్లి జిల్లా పరిధిలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి గ్రామాల నుంచి సింగరేణి కార్మికులు గోదావరిఖని, యైటింక్లైన్‌కాలనీ, సెంటినరీకాలనీ, శ్రీరాంపూర్ ప్రాంతాల్లోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్టుగనుల్లో విధులకు వెళ్తుండగా, జేబులు గుల్ల అవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని, వసూళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కిలోమీటర్ కూడా లేదు.. రూ.వందనా..?

హైవేల మీద వంద కిలో మీటర్లకు కూడా ₹100 తీసుకోరు. ఇంత అన్యాయంగా ఇక్కడ తిప్పి తిప్పి కొడితే కిలో మీటర్ ఉండదు. ఈ మానేరు దాటినందుకు వంద తీసుకుంటున్నరు. ఏదో ఓ ఇరవై రూపాయలంటే ఏం కాదు. కానీ, ఇలా పెద్ద ఎత్తున వసూళ్లు చేయడం అన్యాయం. మల్ల ఈ రిసిప్ట్ ఇవ్వాలనే పని చేస్తదట. రేపు వస్తే పనిచేయదట. ఇంత ఘోరం ఎక్కడన్నా ఉంటదా? ప్రభుత్వమే ఈ వంతెనను త్వరగా పూర్తి చేయాలి.




**-శ్రీనివాస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

### మట్టి రోడ్డుకు వంద తీసుకుంటున్నరు..

మానేరు మీద మట్టి రోడ్డు వేసి రూ. 100 వసూలు చేస్తున్నారు. తప్పని సరి కాబట్టి డబ్బులు ఇచ్చి వెళ్లాల్సి వస్తున్నది. అనధికారిక టోల్ టాక్స్ అయినా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అధిక వసూళ్లు మానేయాలి. మట్టి రోడ్డే కదా.. తక్కువగా తీసుకోవాలి.



**-శ్రీనివాస్, ప్రభుత్వ ఉద్యోగి ఘన్‌పూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**



*దేవునిగుట్ట తండాలో ఎండిన పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు*

# రైతుల పోరాటానికి మద్దతుగా ఉంటాం

- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- దేవునిగుట్ట తండాలో ఎండిన కాలువ, పంటల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 : మల్కపేట కాలువ పరీవాహక గ్రామాల రైతులు కాలువ నీళ్ల కోసం చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఉంటామని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య భరోసానిచ్చారు. అన్నదాతలు ఆందోళన చెందవద్దని, మీ కోసం మీ పక్షాన మేం పోరాడుతామని స్పష్టం చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో ఎండిన 9వ ప్యాకేజీ కాలువ, పంట పొలాలను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరితో కలిసి పరిశీలించారు. పదిహేను రోజులుగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మల్కపేట కాలవకు నీళ్లు వదలాలని విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసినా ఫలితం లేకుండా పోతున్నదని వాపోయారు. రైతులు ఎండిన పొలాలను చూడలేక పశువులకు మేతకు విడిచిపెట్టిన దుస్థితి ఉందని ఆవేదన చెందారు. రాజకీయాలకతీతంగా రైతు పక్షాన నిలబడి మిడ్‌మానేర్ నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు నీళ్లు పంపింగ్ చేయించేందుకు ప్రభుత్వ పెద్దలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందె సుభాష్, కొండ రమేశ్‌గౌడ్, నాయకులు నమిలికొండ శ్రీనివాస్, గుగులోత్ పెంటయ్య, అజ్మీరా రాజు నాయక్, తిరుపతినాయక్, గోగూరి చంద్రారెడ్డి, భూక్యా ప్రభునాయక్, ద్యాప ఎల్లయ్య, దరావత్ కల్యాణ్, ఆకుల మురళీమోహన్ తదితరులు ఉన్నారు.